

వేతనాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు

నస్పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతర అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా 18 మంది ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నార న్నారు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు మార్చి నుంచి పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును జమ చేయడం లేదని, మూడు నెలల నుంచి వేతనాలు సైతం చెల్లించడం లేదన్నారు. ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని హాస్టళ్లలో సిక్‌రూంలు ఏర్పాటు చేయాలని, యూనిఫాం, ఐడీ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఏఎన్ఎంల యూనియన్ నాయకులు సుమిత్ర, రాజమణి, భవాని, స్వేత, లలిత, మహేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

కాసిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్‌లో సోమవారం బుద్ధ జయంతిని అంబేద్కర్ బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు కొమ్ముల బాపు, చిప్పకుర్తి బాపు, వడ్లూరి మల్లేశ్, మద్దివేని చిన్నబీమయ్య, సుంకే రాజమౌళి, రజిని పాలేకర్, కొమ్ముల రజిత, గొడిశెల సతీష్, రామిల్ల వెంకటేశ్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇచ్చేదెప్పుడు?



- సంక్రాంతికి ఇస్తామన్న మంత్రి ఉత్తమ్
- ఆరు నెలలు గడుస్తున్నా అర్హులకు అందని కార్డులు
- జిల్లాలో 15వేల పై చిలుకు దరఖాస్తులు
- కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరం

మంచిర్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీకి మోక్షం లభించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త కార్డులను జారీ చేయడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం తెలంగాణలో లక్షలాది మంది ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. చాలా ఏళ్లుగా రాష్ట్రంలో రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదు. దీంతో కుటుంబాలు వేరుపడిన వారితో పాటు కొత్తగా వివాహం చేసుకున్న వారు రేషన్ కార్డులు ఎప్పుడెప్పుడు జారీ చేస్తారా అని ఎదురు చూస్తున్నా రు. రాష్ట్రంలో అమలయ్యే చాలా ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డు లింక్ ఉండటంతో ఆశావహులు వీటి కోసం నిరీక్షిస్తున్నారు.

ఈ తరుణంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కార్డుల జారీపై కీలక ప్రకటన చేశారు. డిసెంబరులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ... అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, సంక్రాంతి పండుగ నుంచి రేషన్ కార్డుల మంజూరు మొదలవుతుందని ప్రకటించారు. కొత్తరేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్న బియ్యం కూడా అర్హులకు అందిస్తామని అసెంబ్లీ వేదికగా మంత్రి ఉత్తమ్ ప్రకటించడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి.

రేషన్ కార్డుల జారీకి కాంగ్రెస్ హామీ...

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలుత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 వరకు రేషన్ కార్డులను జారీ చేసింది. 2018 డిసెంబరులో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత అనేకమంది దరఖాస్తులు చేసుకోగా, వాటిని 2022 సంవత్సరంలో పరిశీలించి, అందులో అర్హులైన వారికి కొత్త కార్డులను జారీ చేశారు. ఆ తరువాత వెబ్‌సైట్‌ను మూసివేసిన ప్రభుత్వం మళ్లీ రేషన్ కార్డులు ఇవ్వలేదు.

2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రేషన్ కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చింది. అనుకున్న విధంగానే రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు కొత్తరేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రకటించారు. మొదట 2023 డిసెంబరు 9వ తేదీ నుంచి ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, చేయూత పథకంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు ఉచితంగా వైద్య చికిత్సలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు పథకాలను అమలు చేసేందుకు 2023 డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో ఐదు గ్యారంటీ పథకాలు వర్తింపజేసేందుకు స్వీకరించిన దరఖాస్తులతో పాటు, కొత్తరేషన్ కార్డుల కోసం కూడా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2,500 రూపాయలు, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ పథకం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల స్థలంతో పాటు ఇళ్ల మంజూరు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, చేయూత కింద కొత్తగా పింఛన్ మంజూరు కోసం ప్రజాపాలన దరఖాస్తు ఫారాన్ని రూపొందించారు. కోరిన విధంగా దరఖాస్తులను పూరించిన ఆశావహులు వాటిని అధికారులకు అందజేశారు. వీటితోపాటు రేషన్‌కార్డులు లేనివారు తెల్ల రేషన్ కార్డు కోసం

మిగతా 7వ పేజీలో

సాగులో ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలి

ఎంపీ, ఎమ్మెల్యేకు గిరిజన రైతుల వినతి



ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

నెన్నెల, మే 12 (ఆంధ్రజ్యోతి): నెన్నెల శివారులోని సర్వే నంబరు 671, 672లోని ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని గిరిజనులు కోరారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను నిరుపేదలు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. అటవీశాఖ అధికారులు రిజర్వు ఫారెస్టు నెపంతో సాగును అడ్డుకుంటూ, కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఆ భూములు తమకే దక్కేలా చూడాలని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే గిరిజనుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో హరికృష్ణను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు తోట శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస్, గిరిజన నాయకులు జంబి బాపు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

పదోన్నతితోపాటు బాధ్యత పెరుగుతుంది

రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝూ



ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన వారితో సీపీ అంబర్ కిషోర్‌ఝూ

మంచిర్యాలక్రైం, మే, 12 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులతో స్థాయితో పాటు విధుల్లో బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన సిబ్బందికి అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నాలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసుశాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. పోలీసుశాఖ కీర్తిప్రతిష్టలు పెరిగే రీతిలో ప్రజలతో వ్యవహరించాలని సూచించారు.

లక్ష్మీవేంకటేశ్వర నరసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, భక్తులు

లక్సెట్టిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని మోదెల రోడ్డు గుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర నరసింహస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ సోమవారం ప్రారంభం అయింది. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు పాల్గొని మాట్లాడారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు పొందుతారన్నారు. దైవ దర్శనాలు, దైవకార్యాలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. అనంతరం భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ చేశారు. పట్టణ పురోహితులు కొత్తపల్లి భరద్వాజ్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నలుమాసు కాంతయ్య, మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం వల్లే పదవి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

బెల్లంపల్లి మండలం చాకపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

6

ఇంటింటికి ఇంటర్నెట్ ఇంకెప్పుడు..?

- అసంపూర్తిగా టీ-ఫైబర్ పనులు
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
- నెట్ సౌకర్యం లేక జీపీల్లో క్లస్టర్ వ్యవస్థకు మంగళం

7



నెన్నెల జీపీలో నిరుపయోగంగా ఉన్న ఐపీ సెటప్ సిస్టం

వీరజవాన్లకు ఘన నివాళి



బెల్లంపల్లిలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బెల్లంపల్లి, మే12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన వీర జవాన్లకు సోమవారం ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. అలాగే పాత బస్టాండ్ వద్ద నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్ద వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆవడం ఎక్స్‌రోడ్డు నుంచి జాతీయ రహదారిపై మండలంలోని నాయకులు, యువకులు, ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు రవి, రాజ్‌కుమార్ నాయక్, నరేష్, సత్యనారాయణ, మల్లేష్, సాయితేజ, శ్రావణ్‌గౌడ్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహామృత్యుంజయ హోమం



మల్లీడిలో మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న పండితులు

భీమిని (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరిగే యుద్ధంలో భారతీయ సైనికులు గెలవాలని కోరుతూ సోమవారం మల్లీడి అభయాంజనేయ స్వామి దేవాలయంలో మమా మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సంగర్సు మధూకర్‌రావు, ప్రణీత దంపతులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై జరుగుతున్న పోరులో భారత త్రివిధ దళాల సైనికులకు ధైర్య సాహసాలతో మరింత శక్తినివ్వాలని కోరుతూ దండేపల్లి మండలం కోర్విచెల్మ(రాజంపేట)లో భక్తాంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- భారత సైనికుల క్షేమాన్ని కోరుతూ లక్సెట్టిపేట పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళ సంఘం సభ్యులు నరేందుల సాహిత, అక్కనపెల్లి రాధిక, అశ్విత అనే మహిళలు గూడెం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి సన్నిధిలో 240 మెట్లపై వారు మోకాళ్లపై నడిచారు.

వైభవంగా వైశాఖ పౌర్ణమి జాతర

సత్యదేవుడిని దర్శించుకున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



గూడెంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానంలో సోమవారం వైభవంగా వైశాఖ పౌర్ణమి జాతర జరిగింది. ఉదయం నుంచే పలు జిల్లాల నుంచి వందలాది మంది భక్తులు గూడెం గుట్టకు తరలి వచ్చి సత్యదేవుడిని దర్శించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ సమీపంలో గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవుడిని, పంచముఖ అంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో భక్తులు కుటుంబసమేతంగా నిత్యపూజలు,అభిషేక పూజలు నిర్వహించారు. 320మందికి పైగా భక్తులు కుటుంబ సమేతంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు తల్తెతకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను అధికార యంత్రాంగం సమన్వయంతో త్వరగా పరిష్కారం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి సోమవారం అర్జీలను స్వీకరించారు. చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన చల్ల రాజు తాను రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూమి నుంచి కొంత భూమి గొల్లవాగు కాలువలో ముంపునకు గురైందని, ఈ భూమికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. బెల్లంపల్లి మండలం పెద్దనపల్లికి చెందిన అన్నపూర్ణ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దరఖాస్తు చేసుకున్నానని, కూలీ పనిచేసే తన భర్తకు ప్రభుత్వం ఉద్యోగం ఉన్నట్లు జాబితాలో చూపించారన్నారు. తాండూర్ మండలం గోపాలరావుపేటకు చెందిన కాసిపాక లక్ష్మీ తనకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు ఉందని తాను ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. మంచిర్యాల పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన భీమన్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేపట్టానని బిల్లు ఇప్పించాలన్నారు. దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన ఆరె సత్తయ్య తన తండ్రి పేరిట భూమి ఉందని, ఆయన మరణం తరువాత కొందరు వ్యక్తులు ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విన్నవించారు. ఈ భూమిని తన తల్లి పేరిట పట్టా మార్పిడి చేయాలని కోరారు. హాజీపూర్ గుడిపేట, ముల్కల్ల, వేంపల్లి గ్రామాల ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నామని, ఈ గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం అయినందున తమకు ఉపాధి కల్పించాలని విన్న వించారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధిలోని గద్దెరాగడి ప్రాంత వాసులు కాలనీలో రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు నిర్మించాలని కోరారు. మంచిర్యాల పట్టణం తిలక్ నగర్‌లో గర్మిళ్ళ శివారులో గతంలో కొనుగోలు చేసిన ప్లాట్లను తన భూమి అని ఓ వ్యక్తి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాధితులు కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జైపూర్: జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండలంలోని షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, పౌనూరు, శివ్వారం, వేలాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, నీడ, సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైసు మిల్లులకు తరలించాలని సూచించారు. అనంతరం ఇందారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఏర్పాటుకు తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రాజ్‌కుమార్, ఆర్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో బంద్

భీమారం, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్‌లకు సంతాపంగా సోమవారం భీమారం మండల కేంద్రంలో ఒక్క రోజు బంద్ నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు, యువకులు బంద్‌కు పిలుపునివ్వగా మండల కేంద్రం లోని దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు, తదితర దుకాణాలను మూసివేశారు. నిత్యం రద్దీగా ఉండే భీమారం ప్రజలు లేక బోసిపోయింది.

కొనసాగుతున్న భూ భారతి గ్రామసభలు

భీమారం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు దాంపూర్ గ్రామంలో చేపడుతున్న భూ భారతి గ్రామసభలు కొనసాగుతున్నాయి. భీమారంలో 172 మంది రైతులు, దాంపూర్ 156 మంది రైతులు వివిధ భూ సమస్య లపై అర్జీలు పెట్టుకున్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టం ఉందని తహసీల్దార్ సదానందం, డీపీవో కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

మందమర్రిరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్ సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండలంలోని అందుగులపేట జాతీయ రహదారి సమీపంలో లారీలు, టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆపద సమయంలో భయభ్రాంతులకు గురికావద్దు

- మంచిర్యాల డీసీపీ భాస్కర్
- ఎస్టీపీపీలో మాక్ డ్రిల్



ఎస్టీపీపీలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

జైపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): జైపూర్ ఎస్టీపీపీలో పనిచేస్తున్న ఉద్యోగులు అనుకోని సంఘటనలు సంభవించినప్పుడు భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. సోమవారం ఎస్టీపీపీలోని పరిపాలన భవనంలో పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహెల్గాం ఉగ్రదాడి అనంతరం ఇటీవల సరిహద్దుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాల దృష్ట్యా ప్రతీ ఒక్కరు విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వారి ఆధార్‌కార్డును అడిగి పరిశీలించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అస్వస్థతకు గురైనప్పుడు చేయాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంచల్‌సర్కార్, ఎస్టీపీపీ ఈడీ చెన్న కేశవుల చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు శ్రీధర్, శ్వేత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న రెస్క్యూ సిబ్బంది

సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జైనూరు మండలం ఊసేగాం, పోచంలొద్ది గ్రామాలకు చెందిన రైతులు తమ పంపు సెట్లు, వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. పెంచికలపేట మండలం గుంట్లపేట గ్రామానికి చెందిన సాగర్ తాను దివ్యాంగుడినని తనకు పెన్షన్ మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చాడు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామానికి చెందిన మంజుల తనకు దివ్యాంగ ధ్రువపత్రం పునరుద్ధంచాలని, పెన్షన్ ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చింది. వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన జయబాయి తనకు రావాల్సిన వారసత్వ భూమిని తనకు రాకుండా ఇరుతులకు విక్రయించారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేసింది. ఆసిఫాబాద్ మండలం అప్పపల్లికి చెందిన లక్ష్మి తన భూమి కొలతలు జరిపి హద్దులు నిర్ధారించాలని అర్జీ సమర్పించింది. బెజ్జూరు మండలం రెబ్బెన గ్రామానికి చెందిన ధర్మయ్య తాను బెజ్జూరు సహకార బ్యాంకు నుంచి ట్రాక్టర్ రుణం ఐదు లక్షలు తీసుకుని చెల్లించినా నోటీసులు జారీ చేశారని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చాడు. కౌటాల మండలం తాటపల్లికి ఎందిన మంజులబాయి తనకు షెడ్యూల్ కులాల కార్పొరేషన్ నుంచి బోరు బావి, విద్యుత్ సౌకర్యం మంజూరు చేయాలని దరఖాస్తు అందజేసింది. రెబ్బెన మండలం రాళ్లపేట గ్రామానికి చెందిన ఉమారిణి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించింది. రెబ్బెన మండలం పర్సనంబాలకు చెందిన యాదవ్ తనకు 65 సంవత్సరాల వయస్సు ఉందని వృద్ధాప్య పెన్షన్ ఇప్పించాలని అర్జీ సమర్పించాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల ను అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి

నలుగురిపై కేసు నమోదు

బెల్లంపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అశోక్‌నగర్ వద్ద ఆదివారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ సతీష్‌పై దాడి చేసిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా సతీష్ విధులు నిర్వహిస్తున్నాడు. పనినిమిత్తం సతీష్ తన బైక్‌పై కోడలు అద్వైతశ్రీతో కలిసి వచ్చాడు. పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఓ కిరాణం దుకాణం వద్ద బైక్‌ను పార్కింగ్ చేశారు. ఈ క్రమంలో ఎండీ అజీమ్, రోహిత్, సుబ్బు, రోహిత్ అనే నలుగురు యువకులు కారుతో సతీష్ పార్కింగ్ చేసిన బైక్‌కు ఢీకొట్టారు. దీంతో పార్కింగ్ చేసిన బైక్‌ను ఎందుకు ఢీకొట్టారని యువకులను ప్రశ్నించడంతో విచక్షణ కోల్పోయిన యువకులు ఒక్కసారిగా హెడ్ కానిస్టేబుల్ సతీష్‌పై దాడి చేశారు. ఈదాడిలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని గాయాలైన హెడ్‌కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తునికాకు సేకరణ ప్రారంభం

దహెగాం, మే 12 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గిరివెల్లి యూనిట్ పరిధిలోని రాంపూర్, రావులపల్లి, మొట్లగూడ, శంకరపురం, ఖర్జి, గిరివెల్లి గ్రామాల్లో సోమవారం తునికాకు సేకరణ ప్రారంభమైంది. వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ చేపట్టి కట్టలుగా కట్టి కల్లాల్లో ఆరబెడుతారు. వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో కుటుంబ సభ్యులందరు తునికాకు సేకరణకు తరలి వెళ్తున్నారు. సుమారు నెల రోజుల పాటు తునికాకు సేకరణ చేపట్టనున్నారు.

అర్చకులకు ఆసరా.. ఆలయాలకు కొత్త శోభ



డీడీఎన్ పథకంలో కొనసాగుతున్న ఆసిఫాబాద్‌లోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

ఆసిఫాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాలు మరుగున పడకుండా కొత్త శోభ తీసుకురావడమే లక్ష్యంగా గత కొన్నేళ్లుగా ధూపదీప నైవేద్యం పథకం కింద ఎంపిక చేసి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అర్చకులకు గౌరవ వేతనం సైతం మంజూరు చేస్తోంది. తాజాగా దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని ఆలయాల ఎంపికకు ధూపదీప నైవేద్యం కింద దరఖాస్తులకు ఆహ్వానిస్తూ ప్రకటన జారీ చేసింది.

ఆలయాల్లో నిత్యపూజలు..

ఆలయాల్లో నిత్యపూజలు, ధూపదీప నైవేద్యాలు కొనసాగించి అర్చకులకు ఆర్థిక చేయూత అందించేందుకు డీడీఎస్ పథకానికి అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాటి నుంచి అనేక ఆలయాలు ఈ పథకం ద్వారా వెలుగులోకి వచ్చాయి. అంతే కాకుండా నిరుద్యోగ అర్చకులకు ఉపాధి లభించింది. ప్రస్తుతం డీడీఎన్ పథకంలో పని చేస్తున్న అర్చకులకు ప్రతి నెలా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో రూ.4 వేలు ధూప దీప నైవేద్యాలకు రూ.6 వేలు గౌరవ భృతి కింద చెల్లిస్తున్నారు. ఈ పథకంలో నూతనంగా చేరేందుకు ఈ నెల 24 వరకు దరఖాస్తులు కోరుతూ తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు అర్హత,

డీడీఎన్ పథకం కొనసాగుతున్న ఆలయాలు..

జిల్లా	ఫేజ్-1	ఫేజ్-2	ఫేజ్-3	మొత్తం
ఆదిలాబాద్	30	81	44	155
ఆసిఫాబాద్	26	43	34	103
నిర్మల్	49	113	111	273
మంచిర్యాల	51	91	56	198
మొత్తం	156	328	245	729

ఆసక్తి కలిగిన ఆలయాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందుకు ఆలయం నిర్మించి కనీసం 15 ఏళ్లు అయి ఉండాలన్న ప్రాథమిక నిబంధన విధించారు. డీడీఎన్ పథకంలో చేరాలంటే మొదట ఆలయం దేవాదాయ శాఖలో తప్పనసరిగా రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్న నిబంధన ఉంది. కాని కొన్ని ఆలయాలకు రిజిస్ట్రేషన్ లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభంలో రూ. 2,500..

ఉమ్మడి రాష్ట్రంలో పథకం ప్రారంభించిన సమయంలో ధూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.2500 చొప్పున చెల్లించేవారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ఈ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచారు. ఆ తరువాత రూ.10 వేలకు పెంచుతూ జీవో విడుదల చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో పథకం విజయవంతంగా కొసాగుతోంది. చూసేందుకు

డీడీఎన్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిన్న మొత్తంగా కనిపించినా పూజారులకు ఇస్తున్న గౌరవ భృతిని మాత్రం అన్ని ప్రభుత్వాలు ఆదరిస్తున్నాయి. డీడీఎన్ పథకం కొనసాగుతున్న అర్చకులకు ఉద్యోగ భద్రతతో పాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ప్రాథమిక అర్హతగా..

ప్రభుత్వం నిబంధనల్లో 15 ఏళ్లు పూర్తి చేసుకున్న ఆలయాలకు మాత్రమే ఈ పథకానికి ప్రాథమిక అర్హతగా నిర్ణయించింది. ఈ మేరకు 2022లో చివరి సారిగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 729 ఆలయాలు ఉన్నాయి. ఈ పథకం ద్వారా 729 మంది అర్చకులు నెల నెల రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం పొందుతున్నాయి. మూడేళ్లలో 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆలయాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా మరో 120 వరకు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

అర్చకులు సద్వినియోగం చేసుకోవాలి..

శిరీష్‌శర్మ, డీడీఎన్ సంఘం జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న ధూప దీప నైవేద్యం పథకాన్ని అర్చకులు సద్వినియోగం చేసుకోవాలి. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేష న్‌లోని నియమ నిబంధనల మేరకు ఈ నెల 24 లోపు దరఖాస్తులు చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్ల క్రితం నిర్మించి ఆలయాలకు అవకాశం ఉంది. ఆలయం తప్పని సరిగా దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ చేసి ఉండాలి.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

గుంపుల విజయ్, కౌటాల ఎస్సై



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రత పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అదుబాటులో ఉంటూ అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు ప్రజల సేవ కోసమే పని చేస్తున్నారనే భావన కలిగేలా పని చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: చోరీల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎస్సై: మండలంలో చోరీలు జరగకుండా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ముఖ్యం గా ప్రధాన కూడళ్ల వద్ద పర్యవేక్షిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటుకు వ్యాపారులకు అవగా హన కల్పిస్తున్నాం. కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు నిబంధనలు పాటించాలని చెబుతున్నారు. అపసవ్య దశల్లో రోడ్లపై ప్రయాణం చేయ కూడదని చెబుతున్నాం. - కౌటాల, ఆంధ్రజ్యోతి

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ఆసిఫాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి) పాలిటెక్నిక్ ప్రవేశాలుకు నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుండడంతో అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో 1,032 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు పాలిసెట్ కో ఆర్డినేటర్ కనకయ్య తెలిపారు. పరీక్షలకు వచ్చే విద్యార్థులు పెన్ను, పెన్సిల్, ప్యాడ్, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలని చెప్పారు. పరీక్షకు ఒక నిమిషం నిబంధన వర్తిస్తుందని, సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని కో ఆర్డినేటర్ కనకయ్య సూచించారు.

అంబేద్కర్ రాజ్యాంగం వల్లే పదవి

బెల్లంపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే ఎంతో మంది ప్రజా ప్రతినిధులుగా పదవుల్లో ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని చాకపల్లి గ్రామంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్‌తో కలిసి అంబేద్కర్ విగ్ర హాన్ని ఆవిష్కరించి పలు బీటీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎ స్ ప్రభుత్వం పదేళ్లకాలంలో అప్పుల పాలు చేసింద న్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. అంతకుముందు సభలో భారత్ పాక్ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్లకు మౌనం మంత్రి సీతక్క తో పాటు పజా ప్రతినిధులు, అధికారులు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ కుమార్ దీపక్, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్, నియోజక వర్గంలోని కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామంలో సుమారు రూ.1.57 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణపనులను ప్రారంభించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం పది కోట్ల రూపాయిలతో మారుమూల గ్రామాల్లో సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నా మని చెప్పారు. అంతేకాకుండా త్వరలోనే రూ.42 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, అడిషనల్ కలెక్టర్ తివారి, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, శ్యాం నాయక్, అనీల్ గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పూదరి సాయి, సింగిల్ విండో ఛైర్మన్ కె.సంజీవ్ కుమార్, వైస్ ఛైర్మన్ రంగు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లిలో నినాదాలు చేస్తున్న మంత్రి సీతక్క, నాయకులు



చాకపల్లిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క , పాల్గొన్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద కుమరంభీం విగ్రహావిష్కరణ చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల పోడు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటవీ శాఖ మంత్రితో చర్చలు జరిపారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, సబ్ కలెక్టర్ శ్రద్ధా కలెక్టర్, ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ సిడాం గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు.

మొబైల్‌ఫోన్ అప్పగింత

లక్షెట్టిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): బాధితుడు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను లక్షెట్టిపేట పోలీసులు పట్టుకుని అప్పగించారు. వారం రోజుల క్రితం పట్టణానికి చెందిన ఎజాజ్ అనే వ్యక్తి తన ఫోన్‌ను మసీద్ ఏరియాలో పోగొట్టుకున్నాడు. బాధుతుడు లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పిర్యాదు చేశాడు. ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేసి గుర్తించారు. ఫోన్‌ను శనివారం ఎజాజ్‌కు అప్పగించారు. ఫోన్ తిరిగి రాబట్టేందుకు కృషి చేసిన పోలీస్ స్టేషన్ సిబ్బంది రవి, రమేష్, ప్రేంకుమార్‌లను ఎస్సైతో పాటు బాధితుని స్నేహితులు, బంధువులు అభినందించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హమాలీవాడ గేటు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని హమాలీ గేటు సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరి చినట్లు ఆయన తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఆరు మేక పిల్లలు మృతి

రెబ్బెన, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుంజుమేరగూడలో సోమవారం పిచ్చికుక్కల దాడిలో ఆరు మేకల పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గోపిచంద్ మేకలను పెంచుతున్నాడు. మేక పిల్లలు ఉన్న ప్రాంతానికి వచ్చిన కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ఆరు మృతి చెందాయి.

సింగరేణికి పూర్వ వైభవమే లక్ష్యం

మందమర్రి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పూర్వ వైభవమే లక్ష్యంగా ఐఎన్టీయూసీ పలు ప్రణాళికలను రూపొందించిందని ఆ యూనియన్ కేంద్ర కమిటీ సీని యర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్య క్షుడు దేవి భూమయ్యలు తెలిపారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులు పని చేశారని చెప్పారు. ఇప్పుడు గనులు బోసిపోతున్నాయని చెప్పారు. కొత్త బొగ్గు బావు లు రాకపోతే ఉపాధి అవకాశాలు ఉండవన్నారు. సింగరేణి పూర్వ వైభవానికి ఐఎన్టీ యూసీ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కేంద్రం కార్మిక చట్టాలను కాలరాస్తూ పరిశ్ర మలను లేకుండా చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాంశెట్టి నరేందర్, వెంకటేష్, అలుగుల రవి, రాపర్తి శ్రీనివాస్, లక్ష్మణ్‌దాస్, సమ్మయ్య, వేణు, భిక్షపతి, రమేష్, రుపతి, సదయ్య, ఎస్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

శ్రీరాంపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ద్వారా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు తమ యూనియన్ ప్రయత్నిస్తోందని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల యూనియన్ బృందం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్. బలరాంను కలిసి పలు డిమాండ్లను వారి ముందుంచామని తెలిపారు. సమావేశంలో నాయకులు గరిగె స్వామి, పేరం రమేష్, జీవన్ జోయల్, మెండె వెంకటి, భీం రవి, నర్సింగ్ పాల్గొన్నారు.

పరిశీలించి.. సూచనలు చేసి..



గనులను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, మే 12 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గనులను డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీ వద్ద బొగ్గు రవాణా, నిల్వల గురించి జీఎం విజయ భాస్కర్ రెడ్డి, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. కన్వేయర్ బెల్టులను, కోల్ యార్డులను పరిశీలించి నిల్వ సామర్థ్యం, వ్యాగన్ లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. ఖైరిగూడ ఓసీ వద్ద పని స్థలాలను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలోని వివిధ శాఖల అధిపతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ఉత్పత్తి, ఉత్పాదకత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం విజయ భాస్కర్ రెడ్డి, ఖైరిగూడ పీఓ మచ్చగిరి నరేందర్, సెక్యూరిటి అధికారి ఉమాకాంత్, డీజీఎం(సివిల్) ఎస్‌కె మదీనా బాషా, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, సీహెచ్‌పీ ఇన్‌చార్జి పి.శ్రీనివాస రెడ్డి, మేనేజర్ జి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం

శ్రీరాంపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు కోడ్లతో దేశవ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు. నస్పూర్-శ్రీరాం పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్లుగా మార్చిందన్నారు. వాటి అమలుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. కార్మికవర్గం ఆ ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు స్వామి, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సీఐటీయూ ఉప ప్రధాన కార్యదర్శి నాగరాజు గోపాల్, ఏరియా అధ్యక్షుడు బాలాజీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు విశ్వనాథ్, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి.. సేద తీరి..

శ్రీరాంపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధుల్లో తీరిక లేకుండా ఉండే అధికారులు ఆటవిడుపుగా క్రికెట్ ఆడి సేద తీరారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు కొత్తగూడెంలో పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో సోమవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో బెల్లంపల్లి రీజియన్, కొత్తగూడెం రీజియన్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కొత్తగూడెం రీజియన్ జట్టు 20 ఓవర్లలో 130 పరుగులు చేసింది. ఆ తరువాత బెల్లంపల్లి రీజియన్ జట్టు 17 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించి విజేతగా నిలిచింది. సీనియర్స్ విభాగంలో బెల్లంపల్లి రీజియన్ జట్టు 12 ఓవర్లలో 128 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన కొత్తగూడెం రీజియన్ జట్టు 12 ఓవర్లలో 67 పరుగులు మాత్ర మే చేసి ఓటమి చవిచూసింది. మహిళల విభాగంలో కొత్తగూడెం రీజియన్, బెల్లంపల్లి రీజియన్ జట్లు పోటీ పడగా కొత్తగూడెం రీజియన్ జట్టు విజేతగా నిలిచింది. ఉమాదేవి మ్యాచ్ ఆఫ్ ది ఉమన్‌గా ఎంపికయ్యారు.

సీఎండీకి ఐఐఐఈ అవార్డు



అవార్డును ప్రదర్శిస్తున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఐఐఈ) ఆధ్వర్యంలో పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించింది. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఆదివారం నిర్వహించిన 25వ జాతీయ స్థాయి ముఖ్య నిర్వహణాధికారుల సమావేశంలో అవార్డును ప్రదానం చేశారు. సీఎండీ పక్షాన అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, ఐఐఐఈ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు భాస్కర్ పురస్కారం అందుకున్నారు. దానిని సోమవారం సీఎండీకి అందించారు. ఈ సందర్భంగా సీఎండీ మాటాడుతూ ఈ అవార్డు పొందడం ద్వారా ప్రతి ఉద్యోగికి గుర్తింపు లభించిన ట్లుయిందని తెలిపారు.



T FIBER
TELANGANA FIBER GRID

ఇంటింటికి ఇంటర్నెట్ ఇంకెప్పుడు?

- అసంపూర్తిగా టీ-ఫైబర్ పనులు
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
- నెట్ సౌకర్యం లేక జీపీల్లో క్లస్టర్ వ్యవస్థకు మంగళం

నెన్నెల, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి ఇంటర్నెట్, వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం అందిచాలన్న లక్ష్యంతో ప్రారంభమైన టీ-ఫైబర్ ప్రాజెక్టు పురోగతి ప్రశ్నార్థంగా మారింది. సత్వర సేవలు, పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీ కార్యాలయాలతో పాటు ప్రతీ ఇంటికి ఆన్‌లైన్ సేవలు అందిచాలనే సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు. 2015లో ప్రారంభమైన ఈ మెగా ప్రాజెక్టు 2022నాటికే పూర్తి కావాల్సి ఉంది. నిధుల కొరత, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పల్లెల్లో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఏళ్ల గడుస్తున్నా గ్రామాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం లేదు.

నత్తనడకన పనులు..

గ్రామాల్లో ఇంటింటికి 20 ఎంబీపీఎస్, విద్యాలయాలు, పంచాయతి కార్యాలయాలకు ఒక జీబీపీఎస్ కనీస వేగం కలిగిన బ్రాడ్‌బ్యాండ్ సేవలను తక్కువ ధరకే అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ పథకం భారత్ నెట్‌లో భాగంగా జిల్లాలో స్టెర్‌లైట్ అనే సంస్థ పనులను చేపట్టింది. జిల్లాలోని 18 మండలాల్లోని 311 గ్రామ పంచాయతీలకు ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు వందల కిలోమీటర్ల మేర గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లతో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఫైబర్ ఆప్టిక్ కేబుల్ (ఓఎఫ్‌సీ) నిర్మాణం పనులు చేపట్టారు. మండల కేంద్రాల్లో ఆప్టికల్ లింక్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలకు అనుసంధానం చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్న చోట ఎంఐ బాక్సులను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు సోలార్ ఇన్వెర్టర్లు కూడా ఏర్పాటు చేశారు. కాని కనెక్షన్ ఇచ్చేందుకు చిన్న చితక పనులు, కొన్ని టెక్నికల్ పనులు మిగిలి ఉన్నాయి. పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్లకు ఏళ్లు గడుస్తున్న ఇంటింటికి దేవుడెరుగు గ్రామపంచాయతీ కార్యాలయాలకే నెట్ కనెక్షన్ ఇవ్వడం లేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి పూర్తిచేసిన పనులు వృథాగా ఉన్నాయి. విస్తృత ప్రజాప్రయోజనాలు కలిగిన ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



గ్రామంలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ లైన్ పనులు (ఫైల్)

మాన్యువల్ గానే పనులు

మెజార్టీ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఇప్పటికీకార్యకలాపాలు మాన్యువల్ పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. గ్రామానికి సంబంధించిన ఏదైన సమాచారం కావాలంటే రికార్డులు వెతకాల్సిన పరిస్థితి ఉంది. రికార్డులెన్ని వెతికినా కావల్సిన సమాచారం దొరకడం గగణంగా మారుతోంది. ఇంటిపన్నులు, వివిధ అనుమతి పత్రాలు, లైసెన్సు రసీదులు ఇలా ఏదికావాలన్న అధికారులు రాసివ్వాల్సి వస్తోంది. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వాహణ, వ్యర్థాల సేకరణ, పల్లె ప్రగతి పనులు, పంచాయతి రికార్డుల నిర్వహణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పంచాయతీ ఆదాయం, ఆమోదించిన చెక్కులు, జీతాల రసీదులు ఇలాంటి పనులన్నీ మాన్యువల్ పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు. ఇవేకాకుండా ప్రతీ నెల పంచాయతీల ఆదాయ, వ్యయాలను ఆన్‌లైన్ ఆడిట్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పనులన్నింటికి ఇంటర్‌నెట్ సిగ్నల్ ప్రధాన అడ్డంకిగా మారింది.

ఏడు గ్రామాలకు ఓ క్లస్టర్..

గ్రామాలకు ఇంటర్ నెట్ సౌకర్యం లేక క్లస్టర్ల విధానం కనుమరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల వివరాలు, ఆదాయ వ్యయాల సమాచారాన్ని పంచాయతీల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ప్రభుత్వం క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో అయిదు నుంచి ఏడు గ్రామాలను కలిపి క్లస్టర్లుగా విభజించారు. వాటికి అవసరమైన కంప్యూటర్లు, ఇతర సామగ్రిని అందజేశారు. కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. వారికి ఆన్‌లైన్ విధానం, ఈ-పాలనపై శిక్షణ కూడా ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత గ్రామాల్లో బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం లేదనే సాకుతో ఈ విధానానికి మంగళం పాడారు. అందరికీ పంచాయతీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలననే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన క్లస్టర్ల వ్యవస్థ నిర్వీర్యం కావడంతో గ్రామాల ప్రజలకు పంచాయతీ పాలన విధానం దూరమైంది. ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పంచాయతీల వివరాలను పొందుపర్చడానికి మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజలకు ఏదైన అవసరం ఏర్పడితే మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది.

ప్రారంభమైతే ఎన్నో సేవలు

గ్రామాల్లో సైతం ప్రస్తుతం ఇంటర్‌నెట్ వినియోగం పెరిగింది. ప్రైవేటు కంపెనీలు పెద్ద గ్రామాల్లో టవర్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇంటర్నెట్ సౌకర్యం లేని పల్లెలు ఇప్పటికి చాలా ఉన్నాయి. గిరిజన గ్రామాలు, అటవీ ప్రాంతాల్లోని పల్లెల్లో మొబైల్ సిగ్నల్స్ అందక ఇక్కట్ల పాలవుతున్నారు. రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది సిగ్నల్స్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ-బ్యాంకింగ్, ఈ-గవర్నెన్స్, సోషల్ వైఫై, టెలి-మెడిసిన్, వీడియో కాన్ఫరెన్స్‌లు, ఈ-క్లాస్ లాంటి సేవలన్నీ టీ-ఫైబర్ పని చేయడం ప్రారంభమైతే గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. నామమాత్రపు సేవా రుసుముతో ఇంటింటికి ఇంటర్నెట్ అందుతుంది.

పనులు వెంటనే పూర్తి చేయాలి..

టి అరుణ్‌సింగ్, నెన్నెల



ప్రస్తుత కాలంలో ప్రతీ విషయం ఇంటర్‌నెట్‌తో ముడిపడి ఉంది. టీ-ఫైబర్‌తో ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదే. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడం లేదు. పెండింగ్‌లో ఉన్న చిన్న చితక పనులు పూర్తి చేస్తే గ్రామ పంచాయతీల్లో ఈ-సేవలు అందుబాటులోకి వస్తాయి. పరిపాలన సౌలభ్యంతో గ్రామాలు ప్రగతి పథంలో పయణిస్తాయి. ఇంటికింటికి ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇస్తే పల్లె జనం అన్నివిధాల అభివృద్ధి చెందుతారు.

రేషన్ కార్డులు ఇచ్చేదెప్పుడు?

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం అర్హుల జాబితా తయారు చేసి, విడుదల చేసిందే తప్పా...కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తోంది.

- **దరఖాస్తులకు కలగని మోక్షం...**

జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 15వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం, పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం అర్హులైన వారికి రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేసి, దరఖాస్తులు స్వీకరించింది. రేషన్ కార్డులు లేక రూ.500కే సబ్సిడీ వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం పొందలేకపోతున్నారు. రేషన్‌కార్డు ఆధారంగా రూ. 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేయగా, కార్డులు లేని వారికి రుణమాఫీ కాలేదు. అదే రేషన్ కార్డు ఉంటే అందరితో పాటు తమకు కూడా రుణమాఫీ అయ్యేదనే అభిప్రాయాలు రైతుల నుంచి వ్యక్తమయ్యాయి. ఇప్పటికైనా కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని జాబితాల్లో పేర్లున్న లబ్దిదారులు కోరుతున్నారు.

సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు

కాసిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కోమటిచేను శివారు పరిధిలోని 175 సర్వే నంబర్‌లో 12.39 ఎకరాల భూమి కబ్జాకు గురైందని భూమిని అధికారులు సర్వే నిర్వహించి అర్హులకు అందజేయాలని కోరుతూ కోమటిచేనుకు చెందిన రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానానికి చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాలని కోరుతూ గ్రౌండ్ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు బోయిని తిరుపతి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మూడు పంచాయతీరాజ్‌కు సంబంధించినవి, రెండు రేషన్‌కార్డులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. గద్దెలు తొలగించండి రోడ్డుకు అడ్డంగా వేసిన గద్దెలను తొలగించాలని తాండూర్ మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్ రెండో వార్డు సభ్యులు ప్రజావాణిలో మండల ప్రత్యేకాధికారికి దరఖాస్తు అందజేశారు. హనుమాన్ నగర్‌లో నూతనంగా రోడ్డు నిర్మించగా రోడ్డుకు అడ్డంగా కాలనీ వాసులు గద్దెలు కట్టారని, వాటిని తీసివేయాలని పంచాయతీకార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న గద్దెలను తీసివేయాలని కోరారు. కాలనీ వాసులు బండి ఆంజనేయులు, పార్వతి, అజయ్ పాల్గొన్నారు.

అటవీ అధికారుల రక్తదానం

మంచిర్యాలక్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది సోమవారం రక్తదానం చేశారు. ఈ నెల 5 నుంచి 14 వరకు అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, కాగజ్‌నగర్ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ ఎడ్ల లక్ష్మణ్, బెల్లంపల్లి మేనేజర్ సునిత, ఫీల్డ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బోర్లు ఏర్పాటు

చెన్నూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆదేశాల మేరకు మండ లంలోని లింగంపల్లి , ఎర్రగుంటపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమ వారం బోర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామన్న, సమ్మయ్య, సత్తయ్య, మాజీ సర్పంచు లక్ష్మీ, రమేష్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

మందమర్రిరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై పొన్నారం గ్రామంలోని ఉపాధి కూలీలకు ఎంపీడీవో రాజేశ్వర్ సోమవారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలను సేవించవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, కూలీలు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీ రేట్లు పెంచాలి

జన్నారం, మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాది కూలీ రేట్లను పెంచాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. జన్నారం మండలం చింతగూడలో పీడీఎస్‌యూ నాయకులు గ్రామాలకు తరలిండి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్ మాట్లాడారు. ప్రభుత్వాలు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు, కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ మేళా

మందమర్రిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన పీఎం అప్రెంటిస్ మేళాకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. షైనిదర్ ఎలక్ట్రికల్ హైద్రాబాద్, ప్రీమియర్ ఇంజనీరింగ్ హైద్రాబాద్, శ్రీనివాస ఇంజనీరింగ్ వర్క్స్ మంచిర్యాల కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈమేళాలో 37 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్ తెలిపారు. ఎంపికైన వారికి రూ. 13,500 స్టైఫండ్‌తో పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపల్ రమేష్, సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు : సీఐ

మందమర్రి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని జాతీయ రహదారిపై ఆపరేషన్ చెబుత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టుబడిన వారికి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. రోడ్డుపై జులాయిగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. 18 బైకులు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాలుగు డ్రంకెన్ డ్రైవ్, నాలుగు ఓపెన్ డ్రింక్ కేసులు నమోదు చేశామని తెలిపారు. కొందరు యువకులు బైక్ రైడింగ్‌లకు పాల్పడుతున్నారనే సమాచారం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. మందమర్రి పట్టణాన్ని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది

జైపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1 గనిలో కేబుల్‌ను దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు శ్రీరాంపూర్‌ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం కేబుల్ పంపు రిపేరు ఉండడంతో ఐదు రోజుల నుంచి నుంచి కేబుల్ తీసివేసి పక్కకు పెట్టామన్నారు. గమనించిన నిందితులు మూడు రోజులుగా కేబుల్‌ను కొద్దికొద్దిగా కట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. కేబుల్ దొంగతనానికి గురవుతుందని తెలియడంతో ఆదివారం ఎంటీఎఫ్ సిబ్బందితో నిఘా పెట్టామన్నారు. అనుమానస్పదంగా ఒక వ్యక్తి బోర్‌వెల్, కేబుల్ చుట్టూ తిరగడం, పంప్ సబ్‌స్టేషన్ వద్దకు రావడంతో సెక్యూరిటీ గార్డు కొమ్మ బాపు అతడిని పట్టుకుని తమకు సమాచారం అందించారన్నారు. ఎంటీఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకోగా మరో ఇద్దరు నిందితులు పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకున్నామన్నారు. ఇందారం గ్రామానికి చెందిన పులి భరద్వాజ్, బడుగు ప్రశాంత్, సౌతుకు మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని జైపూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. గతంలో కేబుల్, ఐరన్ రాడ్‌లు దొంగతనం చేసినట్లు తేలిందని, వీరికి వేరే ముఠాతో సంబంధం ఉన్నట్లు ఒప్పుకున్నారన్నారు. దొంగలించిన కేబుల్‌ను గోదావరిఖనిలో జంపయ్య అనే వ్యక్తికి అమ్ముతున్నట్లు తెలిపారు. దొంగలించడానికి తెచ్చుకున్న సామగ్రిని, వీరు చెట్ల పొదల్లో దాచి ఉంచిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

చెన్నూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తరావుపల్లి లో పంటల సాగుపై సోమవారం రైతులకు ఏడీఏ బానోత్ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఆయిల్‌ఫాం సాగు ప్రాముఖ్యత గురించి, కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏవో యామిని, ఏఈవోలు సాగర్, రాజశేఖర్ ఉన్నారు.

ఎంపీ పరామర్శ

మంచిర్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా గద్దెరాగడిలో క్యాతన్‌పల్లి సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుర్మ సురేందర్ తండ్రి కుర్మ రామయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, జిల్లా అధికారి ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్, పలిగిరి కనకరాజు, కనకం వెంకటేశ్వర్లు, ఆకుల వెంకటస్వామి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశ్నించినవారే నాయకులవుతారు

-ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం. కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం, ర్యాలీగా వెళ్తున్న ఆదివాసీ గిరిజనులు

జన్నారం, మే12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులు వెనుకబడిన ప్రాంతాల్లో ఉండి ఎప్పటికీ వెనుకబడి ఉంటున్నారని, గ్రామంలోని సమస్యలపై ప్రశ్నించినవారే నాయకులవుతారని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన మూడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు శిక్షణ తరగతులకు కోదండరాం హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆదివాసులు పాత్ర మరువలేనిదన్నారు. ఆదివాసీల హక్కుల కోసం నాడు కుమరం భీం పోరాటాలు చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆదివాసీల గిరిజనుల సంఖ్య ఎక్కువ ఉన్నందున వారిని నాయకులుగా, రాజ్యపాలనలో పాత్ర పోషించడంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామాల అభివృద్ధితో ఆటు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే అక్షరాస్యత సాధించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగుబలహీన వర్గాల కోసం కృషి చేస్తోందని ఈ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. అమరుల ఆశ య సాధనతో పాటు ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించిననాడే మంచి నాయకుడిగా ఎదుగుతామని అన్నారు.

క్రమశిక్షణ, అంకితభావంతో..

క్రమ శిక్షణ, అంకితభావం, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తే మంచి నాయకుడిగా ఎదుగుతాడని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండల కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు నాయకులతో ఏఐసీసీ జాతీయ శిక్షణ కన్వీనర్ రాహుల్‌బల్ యోగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వరకు వెళ్లి శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరై తరువాత మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కన్న కలలను నిజం చేయాలంటే జైబాపు, జైభీం, జై సంవిదాన్ అనే నినాదంతో పని చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఏఐసీసీ జాతీయ శిక్షణ కన్వీనర్ రాహుల్ బల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యానాయక్, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, ఫసియుల్లా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్య ప్రాణులకు హాని

జైపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అడవులు, ప్లాంటేషన్లలో పేరుకుపోయే ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కాలుష్యం కావడమే కాకుండా వన్య ప్రాణులకు హానీ కలుగుతుందని అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి పేర్కొన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం కాన్కూర్ సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ అటవీ ప్రాంతం మార్గాల మీదుగా వెళ్లేవారు ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు పడేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్, కాగజ్ నగర్ మేనేజర్ ఎడ్ల లక్ష్మణ్, బెల్లంపల్లి మేనేజర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరి

లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్



యువకులకు హెల్మెట్ పంపిణీ చేస్తున్న ఎస్సై సురేష్

లక్షెట్టిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా ప్రతీఒక్కరూ హెల్మెట్ ధరించాలని లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ సూచించారు. పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో శనివారం ముల్కల్ల ప్రశాంత్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన హెల్మెట్స్ పంపిణీ కార్యక్రమంలో ఎస్సై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చేతికి అంది వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారి తల్లిదండ్రులు ఎంత బాధ అనుభవిస్తారో మృతుడు ప్రశాంత్ కుటుంబసభ్యుల ద్వారా ప్రతీ ఒక్కరూ గుర్తు ఉంచుకోవాలన్నారు. వారి కుటుంబానికి జరిగిన అన్యాయం ఇంకెవరికి జరుగకూడదని వాహనదారులకు హెల్మెట్స్ పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. ఇలాంటి అవగాహన కల్పిస్తు కార్యక్రమం చేపట్టిన ప్రశాంత్ కుటుంబ సభ్యులను అభినందించారు. అంతే కాకుండా వాహనదారులకు వారితో పాటు హెల్మెట్స్ పంపిణీ చేసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మృతుడు ప్రశాంత్ తల్లి ముల్కల్ల శాంత, సోదరులు ముల్కల్ల నవీన్, శివ, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు మెరుగైన సేవలందించాలి

గర్మిళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిస్టులు మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ సూచించారు. రాష్ట్రప్రభుత్వం ఫార్మాసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా చేస్తూ జీవో జారీ చేయగా జిల్లాలోని 25 మంది ఫార్మాసిస్టులు జీవో కాపీని సోమవారం డీఎంహెచ్‌వోకు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఫార్మాసిస్టులు హాజరు పట్టికలో ఫార్మసీ ఆఫీసర్లుగా నమోదు చేయాలని సూచించారు. సమయ పాలన పాటిస్తూ విధులకు హాజరు కావాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వోకు ఫార్మాసిస్టులకు పుష్పగుచ్ఛం అందించగా వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు కృపాబాయి, సుధాకర్‌నాయక్, శంకర్, చంద్రయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఈ సొల్యూషన్ ఉద్యోగులు, కార్మికులు

నస్పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని నిరసిస్తూ సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఈ సొల్యూషన్ సంస్థ ఉద్యోగులు, కార్మికులు ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఆశ్రమ, సంక్షేమ హాస్టళ్లలో అటెండర్, స్వీపర్, పీఈటీ, ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఎనిమిది నెలలుగా అనంత ఈ సొల్యూషన్ విద్యాంజలి 2.0 సంస్థ చెల్లించడం లేదన్నారు. ఎన్నిసార్లు ఉద్యోగులు, కార్మికులు విన్నవించినప్పటికీ వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోందన్నారు. సక్రమంగా వేతనాలు ఇవ్వని అనంత ఈ సొల్యూషన్ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనంత ఈ సొల్యూలషన్ విద్యాంజలి 2.0 సంస్థ ఉద్యోగుల, కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వరూప, సాయిరాణి, నాయకురాళ్లు రాజేశ్వరి, ప్రశాంతి, రమ్య, సువర్ణ, ప్రణీత, శాతరాజు స్వాతి, గంట నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు

మంచిర్యాలక్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సొసైటీ జనరల్ సెక్రెటరీ చందూర్ మహేందర్, బ్లడ్‌బ్యాంక్ సొసైటీ మెంబర్ మదుసూదన్ రెడ్డి, సభ్యులు ఎడ్ల కిషన్, రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నర్స్ సూపరింటెండెంట్ ఇందుమతిని ఘనంగా సన్మానించారు. వైద్యులు ప్రసాద్, స్రవంతి, ప్రసాద్, హెడ్ నర్సు సఫియా, నర్సింగ్ ఆఫీసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట/కోటపల్లి/జైపూర్/శ్రీరాంపూర్/ఆసిఫాబాద్: లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో, కోటపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, జైపూర్‌లోని ఎస్టీపీపీలో, శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 8 డిస్పెన్సరీలో నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు, నర్సులు, అధికారులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. వర్షం

లింగాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పాటు పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలు లతో కూడిన వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

ఆసిఫాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిర్వహించనున్న ఉపాధ్యాయ శిక్షణ మంగళవారం నుంచి ఈ నెల 17 వరకు మొదటి దశ, రెండో దశలో 20 నుంచి 24 వరకు, మూడో దశ 27 నుంచి 31 వరకు ఉంటుందని డీఈవో యాదయ్య తెలిపారు. శిక్షణకు ఉపాధ్యాయులందరు సకాలంలో హాజరు కావాలని కోరారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య సూచించారు.

గాయపడిన వారికి పరామర్శ

ఆసిఫాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని కౌటగూడ గ్రామంలో గత నెల 29న అడవి పంది దాడిలో గాయపడిన కుమరం రాజుబాయి, కుమరం రవి, కుమరం ప్రేమలతను ఆదివాసీ నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లడుతూ అడవి పంది దాడిలో గాయపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, టీకానంద్, కార్తీక్, దినకర్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కౌటాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చెరువు సమీపంలో గల పురాతన శివాలయం శిథిలావస్థకు చేరడంతో భక్తులు ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టి నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా రెండు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హోమం, పూర్ణాముతి, కుంకుమ పూజ, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి సంతోష్, సత్యనారాయణగౌడ్, చుక్కరాం, భీమయ్య, సాయికృష్ణ, సంతోష్, మధుకర్, ప్రకాష్‌గౌడ్, రుషి పాల్గొన్నారు.

- విత్తన సేకరణలో అప్రమత్తత అవసరం
- ప్యాకెట్లపై లాట్ నంబరు, ప్యాకింగ్ తేదీ, లేబుల్ పరిశీలిస్తే మేలు
- నకిలీగా గుర్తిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి



చూసి కొనాలి.. రశీదు పొందాలి

వాంకిడి, మే 12 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వ్యయ సాయ సీజన్ ప్రారంభమైంది. పంట సాగు కోసం రైతులు పంట పొలాలలను దుక్కి దున్ని సిద్ధం చేసుకుంటున్నారు. అకాల వర్షాల కారణంగా భూమిలో పదను ఉండడంతో దుక్కలు దున్నేస్తున్నారు. జూన్ మొదటి వారంలో మొదలవుతుంది. అయితే ఇప్పటి నుంచే రైతులు పత్తి విత్తనాల కొనుగోలుకు సిద్ధం అవుతున్నారు. రైతులు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఇప్పటి నుంచే పత్తి విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులు విత్తన ఎంపికలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏ మాత్రం ఎమరుపాటుగా ఉన్నా పంట దిగుబడి, పంట కాలం వృధా అయ్యే ప్రమాదం ఉంటుంది.

● గ్రామాల్లో అనధికారంగా..

గ్రామాల్లో అనధికారంగా విత్తనాలు విక్రయించే వారు కమీషన్లకోసం ఆశపడి నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టే వారున్నారు. గత మూడేళ్లుగా కుమరంభీం జిల్లాలో చాలా వరకు నాసిరకం పత్తి విత్తనాల ఈ కారణంగా నష్టపోతున్నారు. గత కొంత కాలం నుంచి నకిలీ పత్తి విత్తనాలు వేసి కొందరు రైతులు తీవ్రంగా నష్ట పోయారు. అనేక మంది వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని నకిలీ విత్తనాలు అంటగడుతుండడంతో రైతులు పంటల దిగుబడులు రాక ఆర్థింకగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 3.5 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట పండిస్తుంటారు.

దళారులు నకిలీ పత్తి విత్తనాలను ఇళ్లవద్దకు తీసుకువెళ్లి రైతులను మాయ మాటలతో మోసం చేసి నకిలీ పత్తి విత్తనాలను అంట గడుతున్నారు. వ్యవసాయ అధి కారుల సూచనలు, సలహాలు తీసుకోక పోవడం, పత్తి విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించక అనేక మంది రైతులు పంటల దిగుబడులు రాక చేసిన అప్పులు తీరలేక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. మధ్యదళారులు ఇచ్చిన విత్తనా లను కొనుగోలు చేయకుండా ఫర్టిలైజర్‌దుకాణాల్లో విత్తుకొన్న ప్రతి రైతు కచ్చితంగా రసీదు, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం, అలవాటు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

● రైతులకు నష్టం..

- నకిలీ విత్తనాలతో రైతులు ఎకరాకు రూ. 10-20 వేల వరకు నష్టపోతున్నారు. నిర్ణీత పరిమాణం కంటే మొలకెత్తే శాతం(జెనెటిక్ ప్యూరిటీ) తగ్గితే నకిలీవిగా పరిగణిస్తారు.
- ప్రభుత్వంతో పాటు కొన్ని ప్రైవేటు సంస్థలు విత్తనోత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాయి. పదుల సంఖ్యలో వంగడాలు మార్కెట్‌లోకి వస్తుండగా విక్రయాలపై పర్యవేక్షణ కొరవడుతోంది.
- నిబంధనల మేరకు గింజ నాణ్యత 98-99 శా తం, మొలకేత్తే గుణం 65-90 శాతం ఉండాలి. పత్తి విత్తనాలకు జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రై ల్ కమిటీ (జీఈఎస్‌సీ) ధృవీకరణ ఉండాలి.
- ప్యాకెట్ లేబుల్‌పై నిర్దేశిత ప్రాంతానికి సరిపో తుందా ?లేదా ? అనే విషయం ముంద్రించాలి. నాణ్య త, మొలక, తేమ, శాతం, పత్తికి బీటీ ప్రొటిన్ శాతం, ల్యాబ్ నంబరు ఉండాలి.
- ఇవేమీ లేకుండానే కొన్ని కంపేనీలు రంగుల కవర్లలో ఇష్టానుసారంగా వివరాలు ముద్రిస్తూ మార్కెట్లోకి తీసుకొస్తున్నాయి.

● ఇవి తప్పనిసరి..

- లైసెన్స్ ఉన్న అధికృత దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తన ప్యాకెట్లపై లాట్ నంబర్, ప్యాకింగ్ తేదీ, టేబుల్ తదితరాలను పరిశీలించాలి.
- విత్తన మొలక శాతం సరిగా ఉందో లేదో చూసుకోవాలి.
- కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానికి మొబైల్‌తో స్కాన్ చేస్తే విత్తనాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.
- నాటే కంటే ముందే కొన్ని విత్తనాలు తీసుకొని మొలక శాతం పరీక్షించుకోవాలి.
- విత్తన సంచులు, రశీదులను భద్రపరుచుకోవాలి. నకిలీగా గుర్తిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి
- గతేడాది వాంకిడి మండలానికి చెందిన రైతు పత్తి సాగు చేశారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పత్తి ఏపుగా పెరిగినా కాయరాలే దు. దీంతో రెండెకరాల్లో మూడు లక్షల రూపాయల వరకు నష్టపోయాడు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు..

- మిలింద్- ఏడీఏ ఆసిఫాబాద్



నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసు కుంటాం. గ్రామాల్లో ఎవరైన పత్తి విత్తనాలు విక్రయిం చేందుకు వస్తే రైతులు తీసుకోవద్దు. లైసెన్సుడ్ దుకాణంలో పత్తి విత్తనాలు కొనుగోలు చేసి రశీదు తీసుకోవాలి. విత్తన ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విత్తనాలకు సంబంధించి పూర్తి సమాచారం వస్తుంది. ఎవరైన నకిలీ విత్తనాలు విక్రయించినట్లు గమనిస్తే సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

పోలీసుల సేవలను వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహి చిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని తక్షణం పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజల సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసుశాఖ పని చేస్తోందన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీక రించేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న రైతులు

రెబ్బెన, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమురవెల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 400 ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ధాన్యాన్ని నారాయణపూర్‌కు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తుందని తెలిపారు. దీంతో ఇబ్బదులు వస్తున్నాయని అన్నారు. తమ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రమేశ్, రాజు, శంకరయ్య, తిరుపతి, మల్లికార్జున్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలించాలి

సిర్పూర్(టి), మే 12 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వ్యాధి నివారణ బృందం సభ్యులు అన్నారు. రాష్ట్ర బృందం సభ్యులు మండలంలోని లోనవెల్లి పీహెచ్‌సీని సోమవారం సందర్శించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీటీ మాత్రలు చికిత్స అందించినట్లయితే పూర్తిగా నిర్మూలించవచ్చని చెప్పారు. అంగ వైకల్యం కాకుండా నివారించవచ్చని తెలిపారు. కుష్ఠు వ్యాధి సర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు డీపీఎంఓ వెంకటేశ్వరచారి, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, డీఎస్‌ఓ సురేందర్ వైద్యులు నవత, నర్సయ్య, హెచ్‌ఈ సునీత, హెచ్ఎస్ పద్మవతి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు

వాంకిడి, మే 12(ఆంధ్రజ్యోతి): జైత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసిన యువకులకు సోమవారం అంబేద్కర్ సంఘం నాయకులు ప్రశంశాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్నిదానాల కంటే రక్త దానం గొప్పదని చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. అంబేద్కర్, బుద్ద జయంతిని పురస్కరించుకొని రక్తదానం చేసిన 22 మంది యువకులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్‌కార్, అంబేద్కర్ సంఘం నాయకులు జైరాం, తిరుపతి, సునీల్, దుర్గం సందీప్, ప్రసాద్, ప్రతాప్, రోషన్, చింటు, విఠల్, జేపీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు .

పెర్సాపెన్ ఉత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న కాత్లే వంశీయులు

కెరమెరి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడి గ్రామంలో సోమవారం కాత్లే వంశీయుల పెర్సాపెన్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆసిఫాబాద్, ఉట్నూర్ ప్రాంతాలకు చెందిన కాత్లే వంశీయులు పాల్గొని తమ ఆరాధ్యదైవం అయిన పెర్సాపెన్(పెద్దదేవుడు)కి ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ సందర్భంగా మోడి గ్రామంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ఆదివాసీ సంప్రదాయబద్ధంగా నృత్యం చేయడం ఆకట్టుకున్నది. అనంతరం పెర్సాపెన్‌కు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కటోడ జైవంత్ రావు, పటేల్ శ్యాంరావు, గ్రామస్థులు లింగోరావు, రాజు, గోపాల్, తెలంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



ఆసిఫాబాద్‌లో సమ్మె పోసర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానికంగా సోమవారం సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి వాటిన అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాజయ్య, సమ్మయ్య, దుర్గా ప్రసాద్, వినోద్, సాగర్, శంకర్, శ్రీను, వెంకట్, నరేష్ పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నగేష్, మోరే శ్వర్, రవి, ప్రకాష్, అశోక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

ఆసిఫాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మంలం ఖిరిడి గ్రామంలోని ఎస్సీ వాడ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కాలనీవాసులు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ వాడ ఏర్పడి ఏళ్ల గడిచినా డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వర్షాకాలం వస్తే మోకాళ్ల లోతు నీళ్లలో నడుస్తూ పనులు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే బురదను దాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీకానంద్, కార్తీక్, దినకర్, శ్రీనివాస్, లక్ష్మి, తారాబాయి, విమలాబాయి, లక్ష్మి, కమలాబాయి, లక్ష్మి, తారాబాయి, దేవి, చంద్రకళ, శంకర్, కలాబాయి, భారతి, కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



రోడ్డుపై పారుతున్న నీరు

కాగజ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ లీకేజీ ఏర్పడింది. ఉదయం వివిధ వార్డులకు సరఫరా చేసేందుకు నీటిని ఈ పైపులైన్ నుంచి వదులుతారు. కాగజ్ నగర్ ఫాతిమా కాన్వెంటు సమీపంలోనే లీకేజీ ఏర్పడి రోడ్డుపై నీరు పారింది. టిప్పర్ లైన్ కాలనీలో రెండు చోట్ల లీకేజీలు ఏర్పడింది. దీంతో తాగు నీరు వృథాగా పోతోంది. ఓ వైపు వేసవిలో తాగేనీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరో వైపు ఇలా పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బుగ్గలో ఆదివాసీ దేవతలకు జలాభిషేకం

సిర్పూర్(యు), మే 12 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(యు),లింగాపూర్ మండలాల సరిహద్దు గ్రామమైన అలీగూడ అటవీ ప్రాంతంలో గల ఆదివాసీల పూణ్య క్షేత్రం బుగ్గలో సోమవారం ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ ప్రాంతలకు ఆదివాసీల పెద్ద దేవుళ్లుకు(పెర్సా పెన్)గంగా జలంతో జలాభిషేకలు చేశారు. అటవీ ప్రాంతంలోనే వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, కటోడ ఆత్రం లింబారావు, మాజీ సర్పంచ్ ఆర్క నాగోరావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, ఆత్రం జ్యోతిరాం, శ్రీరావు ఆత్రం, ఆత్రం బల్వంత్‌రావు, ఆత్రం లక్ష్మణ్, దుర్వా మోతిరాం, మెస్రం రాము, ఆత్రం తుకారాం పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసమే బుద్ధుడి విగ్రహం ఏర్పాటు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి), మే 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసమే సిర్పూర్(టి)లోని నాగమ్మ చెరువులో సొంత డబ్బులతో బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేశామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని సోమవారం నాగమ్మ చెరువులో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం వద్ద మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వచ్చిన బంతేజీలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగమ్మ చెరువు కట్టపై అంబేద్కర్, జ్యోతిబాపూలే తదితర మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. చెరువు కట్టమీద శ్రీలంక దేశం నుంచి ఓ వృక్షాన్ని తెప్పించి ఇక్కడ నాటుతానని నాగ్‌పూర్ నుంచి బంతేజీలకు తెలియజేశారు. దీంతో హైదరాబాద్‌లాగా మినీ ట్యాంక్‌బాండ్, పర్యాటక కేంద్రంగా ఉంటుందన్నారు. పర్యాటక కేంద్రం కోసం నిధులు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వా నికి విన్నవించానని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సతీమణి రమాదేవి చేతుల మీదుగా మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి ఉద యం వరకు నాగ్‌పూర్‌కు చెందిన కళాకారులతో కవ్వాలి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఈవో తిరుపతి, మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, బుద్ధ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం విక్రం, మాజీ సర్పంచ్‌లు కీజర్ హుస్సేన్, బ్రహ్మయ్య, నాయకులు మహేష్, మాంతయ్య, తిరుపతి, రమేష్, వసంత్‌రావు, ఇప్పతుస్సేన్ పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం బుద్ధుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా మండలంలోని ఖమన, కనర్‌గాం, ఇంధాని తదితర గ్రామాల తో పాటు మండల కేంద్రంలోని భీంనగర్, అంబేద్కర్‌నగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్‌లో బుద్ధుడి చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జేపీ సుధాకర్, అంబెడ్కర్ సంఘం నాయకులు జైరాం ఉప్రె, సునీల్, దుర్గం హంసరాజ్, దుర్గ తిరుపతి, రాజేంద్ర ప్రసాద్, దుర్గం సందీప్, ప్రతాప్, రాజేశ్వర్, దుర్గం శ్యాంరావు, రోషన్, రమాబాయి మహిళ మండలి సభ్యులు, ఉపాసకులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెనలో సోమవారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు పెరుగు శంకర్ పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి బోధనలను దైనందిన జీవితంలో పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నేతకాని కులస్తులు తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెనలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు, ప్రజలు



వాంకిడిలో పాల్గొన్న మహిళలు